# మా అన్నయ్య పెండ్లి ★★★

చల్లా లక్ష్మీ నరసింహశాస్త్రి

మా అన్నయ్య స్కూలుఫైనలు ప్యాసయేటప్పటికి 17 వ ఏడు తొంగిచూచింది. స్కూలులో ఫస్టున వచ్చాడు. అందరూ సంతోషించారు. పైచదువులు చదివించాలంటే డబ్బులేదు. మా సంసారం అసలే బహుళం: 8 మంది పిల్లలూ 2 రు పెద్దలూనూ! అదీగాక మా నాన్నను చదివించేటప్పటికి మా తాతలాస్తి 14 ఎకరాలమెట్ట పూర్తయిందట. అదొక అనుభవం వుండటంవల్ల అందుకుపూనుకోలేదు మా నాన్న. మా అన్నయ్య కూడా మా నాన్నని చదివించమని బలవంతపెట్టలేదు కూడాను.

ప్యాసయినాడని తెలిసిందగ్గరనుండి పెండ్లి సంబంధాలు రావటం మొదలుపెట్టినై. మా న్నయ్య 'అప్పుడే ఏంతొందరొచ్చింది. ఉద్యోగందొరికిం తర్వాత చేసుకోవచ్చులే' అని అంటం మొదలు పెట్టాడు. అప్పటికి వయస్సు 17 ఏళ్లే కావటం వల్ల మా వాళ్ళు అంతగా ప్రయత్నాలు సల్పలేదు అన్నయ్యస్నేహితుడికి పెండ్లయింది కూడాను. కాని అప్పటినుండి మా న్నయ్య పెండ్లిచేసుకోను అంటూ బ్రహ్మచారిగానుంటా నంటూ వాగే వాడు. అందుకు అందరూ కోప్పడేవారు. నీకు పెండ్లికాకపోతే తక్కినవాళ్ళకు ఎట్లాఅవుతుందిరా?" అని.

పైచదువులకు స్వస్తిచెప్పించిన తర్వాత ఇంటి దగ్గర ఏంచేసేటట్టా? అని ఆలోచిస్తున్నాడు మా నాన్న. ఏం పాలుపోలేదు. ఊరికే కూర్చోబెట్టితే పిల్లవాడు చెడిపోతాడేమో, ఉన్న రెండుఇంగ్లీషుముక్కలు మరిచిపోతాడేమోనని భయం వేసింది మా నాన్నకు. సెకండరీగ్రేడ్ ట్రయినింగు చదివిద్దామనుకున్నా, ప్రస్తుతం మా నాన్న సెకండరీ టీచరుకావటంవల్ల, అందులో 20ఏళ్ళనుంచీ పనిచేసి అనుభవం కావటం వల్ల దానిమీద పూర్తిగా విరక్తి కలిగింది. పోతేఒక టైపు షార్ట్‌హాండ్ నేర్పించండి. దేంట్లోకి తీసుకుంటారు? అని అన్నారు అంతా. సరేనని యీవూళ్లోనే ఒక మిషనుంటే అక్కడికిపోయి నేర్చుకోవటం మొదలు పెట్టాడు మన్నయ్య. రెండు నెలలతర్వాత షార్ట్‌హాండ్ 200 ఎక్సర్‌సైజులు వ్రాశాడు కూడాను. కాని యింతలో వాటికి స్వస్తిచెప్పాల్సిన యోగం పట్టింది.

మాకిద్దరు మామలున్నారు. అందులో చిన్నాయన 10 ఏళ్ళనుంచీ పొగాకు కంపెనీలో పని చేయటంవల్ల అప్పటికి పెద్దగుమాస్తాగిరిలోకి వచ్చాడు. సీజను ప్రారంభమయింది. కొత్తగుమాస్తాలను తీసుకుంటున్నారు. మామామయ్య అండ చూసుకుని మా నాన్న అన్నయ్యచేతగూడా ఒక అప్లికేషను వ్రాసి పడేయించాడు. సరే ఇంటర్వ్యూకు రమ్మన్నారు. సరే వెళ్ళాడు. తర్వాత పరీక్షలో నెగ్గాడు. ఎలాఅయితేనేం అందులో ఉద్యోగం దొరికింది. 'ప్పుడెవరో మన్నయ్య చెవులో వూదారు, అందుకని మా నాన్న టైపు పరీక్షకు కడతావురా అంటే "అడబ్బాకొట్టుకోవడం ఎందుకని" మొదలు పెట్టాడు. ఆ ఏడునెలలు వాడుపడ్డ శ్రమా, మా నాన్న టైపుకు కట్టిన డబ్బూ ఆ 66 రూపాయల ఉద్యోగం ముందర తృణప్రాయమై పోయినై.

ఈలోపల 6, 7, పెండ్లిసంబంధాలువచ్చినై. ఏలూరునుంచొకటి, ధూళిపూడినుంచొకటి... యిలా నానాప్రదేశాలనుంచి అనుకోండి. మా అన్నయ్య అంత దూరాభారం వద్దన్నాడు. పల్లెటూళ్ళ సంబధం పనికిరాదన్నాడు. మా నాన్నకు జాతకాలు చూచే అలవాటుందిలెండి. అందువల్ల మన్నయ్య జాతకంచూసి వాడికి ఆదశలో యీ అంతర్దశ జరుగుతున్నదనీ, దీంటో అది జరుగుతున్నదనీ వీడికప్పుడే పెండ్లి అయ్యేటట్టు లేదనీ,

ఏదో అంటూండేవాడు. పిల్లనిస్తామని వచ్చిన వాళ్ళలో కొందరు పిల్లజాతక చక్రాలు గూడా తెచ్చారు. మా నాన్నఅసలు ఆడపిల్లల జాతక చక్రాలను నమ్మడు. కారణం? కొందరుపిల్లలకు పెండ్లి కావటానికి ఉచ్ఛస్థానాల్లో మంచి గ్రహాలుంచి తయారుచేసుకొస్తారు. ఇలా వేసుకొచ్చిన వాళ్ళలో ఒకరిద్దరి చక్రాలుచూస్తే మా నాన్నకు నవ్వొచ్చేదికూడాను.

మా నాన్నకూడా మన్నయ్య పెళ్ళిలో కొద్దిగా ఆలస్యం చేశాడనక తప్పదు. ఎందుకంటే జాతకంమీద మన్నయ్యకు తల్లివైపు సంబంధం కొద్దిగా కలిసే సూచనలున్నాయన్నాడు. దగ్గర్లో ఎవ్వరూ లేకపోయినా ఎక్కడో మాఅమ్మ పింతల్లి కూతురుకూతురు ఒకమ్మాయియుందట. "పిల్ల ఏమైనా అవుతుందేమో" నుకున్నాడు. వాళ్ళు (మన్నయ్య కాలుపొడుగు వాడులెండి) మన్నయ్యకు ఏ 20 ఏళ్ళో ఉన్నాయన్నారట. తర్వాత మా నాన్న ఆమాటఎత్తలేదు. ఇప్పటికి పదిసంబంధాలు పైగా వచ్చినై. కాని ఒక్కటీకుదరలేదు ఆసలు పిల్లను చూడటానికి వెళ్ళకముందే వాళ్ళ వంశం అదనీ, యిదనీ, పిల్లనలుపనీ, పిల్లవాడి ముందు బాగుండదనీ (మా అన్నయ్య మా అందరిలోకి పసిమిలెండి) వాళ్ళు కట్నాలీయలేరనీ,అనే వాళ్ళు.

ఇలా సంబంధాలు నడుస్తున్నాయి మన్నయ్యకు, 18 వ ఏడు పూర్తికావస్తున్నది. పొగాకు కంపెనీలో సీజనుఅయిపోయింది. అక్కడబాగా పనిచేసి మెప్పుపొందటం మూలకంగా అక్కడ నుంచి చీరాలకు ట్రాన్సఫరు చేశారు పోస్ట్ చేయకుండా, ట్రాన్సఫరుచేసిన కొద్దిరోజులకే పర్మినెంట్ గూడా అయింది. జీతం 80 రూ దాకా పెరిగింది. ఇది తెలిసి ఇంకా కొంతమంది వచ్చారు. మా నాన్న కొందరిని చూడటానికి వెళ్ళాడు. కాని ఆయనకేనచ్చలేదు. మా నాన్నకు ఎట్టిటి పిల్లను చేయాలని, సంగీతం వచ్చినకోడలు కావాలని ఆశ. ఇంతకూ కాలంకలిసిరాలేదంటూ ఊరుకున్నాడు. ఇప్పటికి దాదాపు 20 సంబధాలు కాన్సిల్ అయిపోయినై.

కొద్దిరోజులకు ఒక నానుడు తగులుకుంది. దీని మూలకంగా కూడా మన్నయ్య పెండ్లిఆలస్యంగా అయిందనవచ్చు. వారు (ఆ పిల్ల పేరుచెప్పటం బాగుండదేమో) కబురుచేశారు. మా నాన్న తోడుగా యింకో పంతులూ వెళ్ళారు. పిల్ల నచ్చింది. తలకట్టు గిలకట్టు బాగానే వుందట. ఆయన అన్నింటికిందా వెయ్యిన్నూటా పదహార్లు యిస్తానన్నాడు. కాని మా బంధువులంతా ఆ మాత్రానికేం చేసుకోకపోతే. అలాంటి రంభలు రారనా! ఇంకా కొద్దిరోజులాగితే మంచిసంబంధాలే వస్తాయని' అంటం మొదలుపెట్టారు. అందులో మన్నయ్య మొదటినుంటీ 'మనంఅసలే అప్పుల్లోవున్నాం. నాపెళ్ళికిమాత్రం దమ్మిడీ గూడా అప్పుగానివ్వగూడదు. అంతాకట్నంలో సరిపోవాల్సిందే' అని అంటున్నాడు. నేనిప్పుడు చెప్పిన సంబంధం మా నాయనమ్మ వెళ్ళిచూసి వచ్చింది. ఆపిల్లను భూలోకరంభ అంటూ మెచ్చుకొని ఆపిల్ల మనయింట్లోవుంటే చాలునంటం మొదలు పెట్టింది. తర్వాత మమ్మా అన్నయ్యాలు వెళ్ళిచూశారు కాని పిల్లవాళ్లకు రంభలాగా కనబడలేదట ఎందుచేతనో! ఒక మోస్తరుగా వుంది. కట్నంయిస్తే చేసుకోవచ్చునన్నాడు.

మేంచేసుకోదలచిన పిల్ల తలిదండ్రులకు ఒక అల్లుడున్నాడు. ఆయనగారికి వారేమీ కట్నం యివ్వలేదట. అందుకని' మీరురెండో పిల్లకు ఎంతకట్నంయిచ్చి పెళ్లిచేస్తారో అంతా నాకిస్తేగాని కాపురం చేసుకోనన్నాడట' దాంతో ఆయన పనయింది. మేము ఎన్నిఉత్తరాలు రాసినా యీరోజొస్తా, ఆరోజొస్తానని వ్రాసేవాడేగాని అసలు రాలేదు- ఆయన వెయ్యేళ్ల పూజారి- అందుకని మా నానన్న 'ఒక వేళకుదిరినా ఆ లగ్గంనాడు కొస్తా ఏపూరుపోయి కూర్చుంటాడో అని భయపడ్డాడు- ఉత్తర ప్రత్యుత్తరాలతోటి నాలుగైదు నెలలు గడచిపోయినై- చివరకు విసుగుపుట్టి 'మీ సంబంధం మానుకున్నాము' ని వ్రాశాడు వాళ్ళకి-

ఇక పోతే ఇతరచోట్లనుంచి మా బంధువుల దగ్గరికి వచ్చేవికొన్ని- మా నాన్న వాళ్లనే పంపి

చూసి రమ్మనేవాడు. అలా పిల్లలు నచ్చక కొన్ని దూరాభారమై కొన్ని, కట్నాలు యీయలేక కొన్ని వంశంమంచిదికాదని కొన్ని, పోయినై. ఇక ఊళ్ళోకొన్ని సంబంధాలు వచ్చినై. వాటి వసలు ఎత్తవద్దన్నాడు మన్నయ్య. ఇప్పటికి మన్నయ్యకు 19వ ఏడు పూర్తి కావచ్చింది. మా నాన్నకు ఆరాటం జాస్తిఅవుతున్నది. మనస్సు స్థిమితంలేకపొయ్యేది. ఎన్ని సంబంధాలు వచ్చాయని ఒకనాడు లెక్కవేసి చూస్తే అప్పటికి ౮0 సంబంధాలు తేలినై. అవీ ఏవంటే మా యింటికి గాని, బంధువులదగ్గరికిగాని వచ్చినవి మొత్తం ఇక విన్నవెన్నో లెక్కలేదు.

ఒక సంబంధం దగ్గర మా నాన్నకు మన్నయ్యకు తగవు అయింది. నువ్వు సంబంధముచేసుకోవాలి. లేకపోతే నేనింక తిరగలేను. నాకూ ప్రాణం విసుగెత్తి పోతున్నదని' యింకా ఏమేమో అన్నాడట. మన్నయ్యకు కళ్ళనీళ్ళపర్యంతంఅయింది. ఆసంబంధంద తప్పిపోయింది.

చిట్టచివరకు మా నాయనమ్మ వాళ్ళఆడపడుచు సంబంధం ఒకటి వచ్చింది. మా నాయనమ్మ మా నాన్న, నేను ఆపిల్లను యిదివరకే చూచాం. బాగానే వుంటుంది. మన్నయ్య మమ్మ యిద్దరూ వెళ్ళిచూచి వచ్చారు. బాగానే వుందన్నారు. కట్నాలు మాట్లాడుకోండని మన్నయ్య ఊరుకున్నాడు. ఇక మా నాన్న ఎంతకైనా అప్పో సొప్పో చేసైనా పెండ్లిచెయ్యాలని కూర్చున్నాడు. పిల్లతండ్రికిమాత్రం ఏమీలేదుగాని మేనమామలు అన్నింటిక్రిందా 1116 అని అన్నారు. లాంఛనాలు, గింఛనాలు అన్నీ అందులోనే అన్నారు. మా నాన్న వప్పుకోక తప్పిందికాదు. శుభం అన్నారు అందరూ కూడాను. మొన్న మొన్ననే పెండ్లిజరిగింది అప్పటికి 20వ ఏడు తొంగిచూచింది మన్నయ్యలో.

మొదటినుండీ మా నాన్న కాఫీ తాగనికోడలు కావాలంటుండేవాడు మొదట్లో ఎవరొచ్చినా మీ పిల్లకు కాఫీ అలవాటుందా అని అడిగేవాడు చివరకు విసుగెత్తి ఆతొందరలో ఇవేవీ కనుక్కోకుండానే ముడిపెట్టాడు మొన్న మా వాళ్ళకుర్రవాడు ఒకడు వాళ్ళ యింటికి వెళ్లితే 'ఏమయ్యో ఇదివరకు రెండుతడవలు కాఫీతాగేది యిప్పుడు మూడుతడవలు తాగుతాగుతుందయ్యో మీపిల్ల' అని అన్నారట కాఫీతాగని పిల్ల కావాలనుకున్నందుకు రోజుకు మూడుతడవలుతాగే పిల్ల, సంగీతంవచ్చినపిల్ల కావాలన్నందుకు అజ్ఞానంలేని పిల్లా, రంభ కావాలనుకున్నందుకు అంతటిదికాకపోవటం ఎలాజరిగాయో చూడండి రెండువేలూ మూడువేలూ యిస్తామన్న సంబంధాలన్నీ మానుకొని చివరకు అన్నిటికిందా 111 కు చేసుకోవటమైంది, చేతిచిలుము 4, 5 వందలు వదిలింది. పల్లెటూరిపిల్ల పనికిరాదనుకున్నందుకు అటువంటి పిల్లేదొరికింది. అత్తగారివూరు వెళ్ళాలంటే ఒక స్టేషన్ దిగి 4, 5 మైళ్లు నడిచి వెళ్ళాలి లేకపోతే 4 రూ యిస్తేగాని బండికట్టరు వర్షాకాలమైతే బూట్లుకొనుక్కో నక్కరలేదు అత్తమామలు అల్లుడి సరదాలు తీర్చగలవారా అంటే వాళ్ళది బీదకాపరం చూడండి చివరకు ఎలాంటిసంబంధంకుదిరిందో!

మొదటినుంచీ పెండ్లంటే విముఖంగా వుండేవాడు, బ్రహ్మచారినై వుంటానన్నవాడు పెండ్లయిం తర్వాత అప్పుడే భార్యకాపురానికి రాకముందే ఉత్తరాలు వయస్సుతోపాటు వాంఛలు గూడా మనలో తెలియకుండానే ప్రవేశిస్తాయి! ఏమంటారు?


## ఏజంట్లు కావలెను

"ఆనందవాణి" పత్రికను కమీషనుపద్ధతి మీద విక్రయించడానికి మా ప్రతినిధులు లేని ప్రాంతాలలో ఏజెంట్లు కావలెను. ధరావత్తు కట్టగలిగినవారు ఇతర వ్యాపార షరతులకు ఈ దిగువ చిరునామాకు వ్రాయవచ్చును.

మేనేజరు
"ఆనందవాణి"
12, తంబుచెట్టి వీధి
మద్రాసు - 1